సాక్షి
రంగారెడ్డి
ఆదివారం । 1 । జూన్ । 2025



నిధులు లేక పనులు సాగక!

నిధులు లేక సరూర్‌నగర్ ప్రభుత్వ కాలేజీలో చేపట్టిన అదనపు తరగతి గదుల నిర్మాణ పనులు మధ్యలోనే నిలిచిపోయాయి. 8లో▸



రెచ్చిపోయిన కబ్జాదారులు

కొండాపూర్‌లో కబ్జాదారులు రెచ్చిపోయారు. పెట్రోల్ ప్యాకెట్లు, రాళ్లు, కర్రలతో భయభ్రాంతులకు గురి చేశారు. 8లో▸



సంక్షేమమే ధ్యేయం

నిరుపేదల సంక్షేమమే ధ్యేయంగా నిరంతరం కృషి చేస్తున్నానని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. 8లో▸

సమీకృత అలసత్వం!

ఇంటిగ్రేటెడ్ గురుకులాలకు ముందుకు పడని అడుగు

- 25 ఎకరాలు.. రూ.200 కోట్లతో నిర్మాణ ప్రతిపాదన
- గత అక్టోబర్ 11న కొందుర్గులో ముఖ్యమంత్రి శంకుస్థాపన
- ఎనిమిది నెలలైనా తట్టెడు మట్టి తీయని వైనం
- కొత్తగా మరో నాలుగింటికి పాలనా అనుమతులు



కొందుర్గులో శంకుస్థాపన చేస్తున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి (ఫైల్)

సాక్షి, రంగారెడ్డిజిల్లా: కుల రహిత సమాజ స్థాపనే లక్ష్యంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థులందరినీ ఒకే గొడుగు కిందికి తెచ్చే కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వం నియోజకవర్గానికి ఒక 'యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ కాంప్లెక్స్' (సమీకృత గురుకులాలు)ను నిర్మించనున్నట్లు ప్రకటించింది. ఈ మేరకు గత ఏడాది అక్టోబర్‌లో షాద్‌నగర్ నియోజకవర్గం కొందుర్గు రెవెన్యూ పరిధిలో నిర్మించే భవనానికి సీఎం రేవంత్‌రెడ్డి ఎంతో ఆర్భాటంగా శంకుస్థాపన చేశారు. ఇప్పటికీ తట్టెడు మట్టి కూడా తీయలేదు. తాజాగా గ్రేటర్ జిల్లాల పరిధిలో మరో నాలుగు సమీకృత గురుకులాల నిర్మాణానికి పాలనాపరమైన అనుమతులు జారీ చేశారు. ఒక్కో భవనానికి రూ.200 కోట్లు మంజూరు చేశారు. 25 ఎకరాల విస్తీర్ణంలో నిర్మించనున్న ఒక్కో కాంప్లెక్స్‌కు మొదట్లో రూ.125 కోట్లు ఖర్చవుతుందని అంచనా వేశారు. తర్వాత ఏకంగా రూ.75 కోట్లకు పెంచేశారు. సమీకృత గురుకులాలకు శంకుస్థాపన చేసి ఎనిమిది నెలలవుతున్నా ఇప్పటి వరకు పనులు ప్రారంభించలేదు.

అంతరాలు లేని సమాజం కోసం

గత ప్రభుత్వ హయాంలో ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ విద్యార్థుల కోసం ప్రత్యేక గురుకులాలు ఏర్పాటు చేశారు. మొదట్లో వీటికి మంచి ఆదరణ కూడా లభించింది. ఇక్కడ చదువుకున్న విద్యార్థులు టెన్త్, ఇంటర్మీడియెట్‌లో ఉత్తమ మార్కులు సాధించారు. పోటీ పరీక్షల్లోనూ సత్తా చాటారు. అడ్మిషన్ల కోసం తల్లిదండ్రులు, విద్యార్థులు ఎంతో శ్రమించాల్సి వచ్చేది. తర్వాత ప్రభుత్వం ఆయా గురుకులాలపై శ్రద్ధ చూపకపోవడం.. మెజార్టీ గురుకులాలు ఇప్పటికీ ప్రైవేటు అద్దె భవనాల్లోనే కొనసాగుతుండటం.. వాటిలో సరైన మౌలిక సదుపాయాలు లేకపోవడం.. నాసిరకం మెనూ కారణంగా విద్యార్థులు తరచూ అస్వస్థతకు గురవుతుండటంతో ప్రాధాన్యత తగ్గుతూ వచ్చింది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కులాలు, మతాల మధ్య అంతరాలను తొలగించేందుకు ఆయా గురుకులాలన్నింటినీ ఒకే గూటి కిందికి తేనున్నట్లు ప్రకటించింది. ఇందులో భాగంగా నియోజకవర్గానికి ఒక 'యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ కాంప్లెక్స్'ను నిర్మించనున్నట్లు ప్రకటించింది.

త్వరలోనే విద్యా సంవత్సరం ప్రారంభం

కొత్తగా ఏర్పాటు చేసే గురుకులాల్లో నాలుగు నుంచి 12వ తరగతి వరకు అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన ఇంగ్లిష్ మీడియంలో విద్యాబోధన అందించనున్నట్లు పేర్కొంది. 5000 మంది విద్యార్థులకు సుమారు 500 మంది ఉపాధ్యాయుల నియామకం, తరగతి, వసతి గదులు, డైనింగ్ హాల్స్, డిజిటల్ స్మార్ట్ బోర్డులు, కంప్యూటర్ సెంటర్లు, ఐదు వేల పుస్తకాలతో ప్రత్యేక లైబ్రరీ, క్రీడలను ప్రోత్సహించేలా క్రికెట్, ఫుట్‌బాల్ గ్రౌండ్స్, బాస్కెట్ బాల్, టెన్నిస్ కోర్టులను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపింది. మరికొద్ది రోజుల్లో విద్యా సంవత్సరం ప్రారంభం కాబోతున్నా ఇప్పటి వరకు ఆయా సమీకృత గురుకుల భవనాల పనులు చేపట్టలేదు. ఇప్పటికే శంకుస్థాపన చేసిన 28 సమీకృత గురుకులాల్లో కేవలం రెండు మూడు నియోజకవర్గాల్లో చేపట్టే భవనం పనులు మాత్రమే టెండర్ పూర్తి చేసుకున్నట్లు తెలిసింది. మిగిలిన చోట్ల కాంట్రాక్టు ప్రక్రియను కూడా పూర్తి కాలేదు. సత్వరమే నిర్మాణ పనులు చేపట్టాలని విద్యార్థి సంఘాలు, విద్యావేత్తలు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నారు.



ముగింపు సభలో మాట్లాడుతున్న హేమంతురావు

మావోయిస్టులతో చర్చలు జరపాలి

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు హేమంతురావు

చేవెళ్ల: కేంద్ర ప్రభుత్వం ఆపరేషన్ కగార్‌ను ఆపి మావోయిస్టులతో శాంతి చర్చలు జరపాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు బాగం హేమంతురావు అన్నారు. మున్సిపల్ కేంద్రంలోని సత్యసాయి పాఠశాలలో మే 26 నుంచి 31వ తేదీ వరకు జరిగిన రాష్ట్రస్థాయి జనసేవాదళ్ శిక్షణ శిబిరం శనివారంతో ముగిసింది. ఈ సందర్భంగా పార్టీ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య ఆధ్వర్యంలో జనసేవాదళ్ సభ్యులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు ర్యాలీ నిర్వహించారు. అనంతరం చౌరస్తాలో నిర్వహించిన సభలో హేమంతురావు మాట్లాడుతూ.. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం వచ్చిన తరువాత దళితులు, మైనార్టీలపై దాడులు పెరిగాయని ఆరోపించారు. మతోన్మాద మూకలు చెలరేగిపోతున్నాయని, ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. పేదల పక్షాన సీపీఐ నిలబడి పోరాడుతుందని స్పష్టం చేశారు. వందేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా దేశవ్యాప్తంగా పార్టీని బలోపేతం చేసేందుకు జనసేవాదళ్ సైన్యాన్ని తయారు చేస్తోందని తెలిపారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర సమితి సభ్యులు కె.రామస్వామి, పి.పర్వతాలు, జిల్లా కార్యవర్గ సభ్యులు ఎం. ప్రభులింగం, రామకృష్ణ, యాదగిరి, జన సేవాదళ్ రాష్ట్ర కన్వీనర్ పి.రమేశ్, కో కన్వీనర్ అనిల్‌కుమార్, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి వడ్ల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



జనసేవాదళ్ సభ్యుల ర్యాలీ

న్యూస్‌రీల్

పదో తరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీకి ఏర్పాట్లు

ఇబ్రహీంపట్నం రూరల్: జూన్ 3 నుంచి 13వ తేదీ వరకు పదో తరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి సుశీందర్‌రావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు జరుగుతాయని తెలిపారు. జిల్లాలో మొత్తం 23 కేంద్రాల్లో 6,893 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు చెప్పారు. జిల్లా మొత్తాన్ని నాలుగు రూట్లుగా విభజించామని, 13 పోలీస్‌స్టేషన్లలో సంబంధిత ప్రశ్నపత్రాలను భద్రపర్చినట్లు వెల్లడించారు. పరీక్షలు ప్రశాంతంగా జరగడానికి అన్ని రకాల ఏర్పాట్లు చేయాలని సిబ్బందికి సూచించామన్నారు. ఫెయిలైన విద్యార్థులంతా పరీక్ష రాసేలా ప్రధానోపాధ్యాయులు చొరవ తీసుకోవాలన్నారు.

శంకర్‌పల్లిలో మాజీ సీఎం కిరణ్‌కుమార్ రెడ్డి



తహసీల్దార్ కార్యాలయం వద్ద నల్లారి కిరణ్‌కుమార్ రెడ్డి

శంకర్‌పల్లి: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి నల్లారి కిరణ్‌కుమార్ రెడ్డి శనివారం శంకర్‌పల్లి తహసీల్దార్ కార్యాలయానికి వచ్చారు. మండల పరిధిలోని జన్వాడ గ్రామంలో సర్వే నంబర్ 724లో ఎకరా 20 గుంటల భూమిని రిజిస్ట్రేషన్ చేసుకునేందుకు వచ్చినట్లు తహసీల్దార్ కార్యాలయ వర్గాలు తెలిపాయి. మాజీ సీఎం రావడంతో పలువురు ఆయనతో ఫొటోలు, సెల్ఫీలు దిగేందుకు ఆసక్తి కనబరిచారు. సుమారు అరగంట పాటు ఉన్న ఆయన రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తయిన అనంతరం వెళ్లిపోయారు.

రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోండి

ఇబ్రహీంపట్నం ఆర్డీవో అనంతరెడ్డి



ఇబ్రహీంపట్నం: రెవెన్యూ గ్రామాల వారీగా ఈనెల 3 నుంచి సదస్సులు ఉంటాయని, ఈ సందర్భంగా వచ్చే ఫిర్యాదులు, అర్జీలను వెంటనే పరిష్కరించేందుకు రెవెన్యూ అధికారులు కృషి చేయాలని ఆర్డీవో అనంతరెడ్డి అన్నారు. హయత్‌నగర్, అబ్దుల్లాపూర్‌మెట్, మంచాల, యాచారం, ఇబ్రహీంపట్నం, మాడ్గుల మండలాల రెవెన్యూ అధికారులు, సిబ్బందికి శనివారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆర్డీవో అనంతరెడ్డి మాట్లాడుతూ.. ఈనెల 23వ తేదీ వరకు సదస్సులు కొనసాగుతాయని చెప్పారు. రైతులు, ప్రజలు భూ సంబంధిత సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావాలని తెలిపారు. పరిష్కరించే అవకాశం ఉన్న సమస్యలపై అధికారులు సదస్సులోనే నిర్ణయం తీసుకోవాలని సూచించారు. సదస్సులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. సమావేశంలో ఇబ్రహీంపట్నం తహసీల్దార్ సునీతారెడ్డి, ఆయా మండలాల తహసీల్దార్లు, డిప్యూటీ తహసీల్దార్లు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

వరద సాఫీగా సాగాలి

సాక్షి, సిటీబ్యూరో: వర్షాకాలంలో లోతట్టు ప్రాంతాలు, రహదారులు మునిగిపోకుండా చర్యలు తీసుకోవాలని హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ అధికారులను ఆదేశించారు. ఇరిగేషన్ జీహెచ్‌ఎంసీ, మున్సిపల్ శాఖల్లో నాలాల విభాగానికి చెందిన ఇంజినీరింగ్ అధికారులతో శనివారం హైడ్రా కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నాలాల సమస్య తలెత్తకుండా పటిష్టమైన చర్యలు తీసుకోవాలని.. ఎక్కడైనా సమస్య ఉంటే వెంటనే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. నాలాల ఆక్రమణలో నివాసాలుంటే పరిష్కార మార్గాలను అన్వేషిస్తామని, ఇతర కట్టడాలను మాత్రం తొలగించక తప్పదని తెలిపారు. చెరువుల పునరుద్ధరణతో పాటు నాలాల పరిరక్షణకు ప్రభుత్వం ప్రాధాన్యమిస్తోందని.. ఈ క్రమంలోనే కబ్జాల నివారణపై హైడ్రా దృష్టి పెట్టిందని చెప్పారు. నాలాలు కుంచించుకుపోయినా, ఆటంకాలు ఏర్పడినా, ఆక్రమణలకు పాల్పడినా వివరాలివ్వాలని కోరారు. ఇందుకు సంబంధించిన నివేదిక రూపొందించాలని సూచించారు. కల్వర్టుల వద్ద చెత్త పేరుకుపోతోందని, తొలగించడంలో నిర్లక్ష్యమే వరద ముప్పునకు ప్రధాన కారణమని తెలిపారు. నాలాల్లో చెత్త, నిర్మాణ వ్యర్థాలు వేసిన వారిపైన కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ఈ ఏడాది నగరానికి వరద ముప్పు లేకుండా అందరూ సమన్వయంతో కలిసి పని చేయాలని హైడ్రా కమిషనర్ సూచించారు.

కబ్జాలపై ప్రజావాణిలో ఫిర్యాదుల స్వీకరణ

సాక్షి, సిటీబ్యూరో: వర్షాకాలం ప్రారంభం కావడంతో మురుగు, వరద నీరు రహదారులను ముంచెత్తి ట్రాఫిక్ అంతరాయాలకు కారణమవుతోంది. ఈ సమస్యలపై హైడ్రా దృష్టి పెట్టింది. ఇప్పటికే చెరువుల పునరుద్ధరణకు చర్యలు తీసుకుంటున్న హైడ్రా.. వర్షాకాలం కావడంతో నాలాల ఆక్రమణలపై ప్రధానంగా దృష్టి పెట్టింది. నాలాల ఆక్రమణలు, ఇబ్బందులపై ప్రజావాణిలో ఫిర్యాదులను స్వీకరించాలని హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ సూచించారు. జూన్ నెలతో పాటు అవసరమైతే జులై నెలలో కూడా నాలాల సమస్యలపైనే ఫిర్యాదులు స్వీకరించి వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. ఓఆర్ ఆర్ పరిధిలో నాలాల కబ్జాలకు సంబంధించి ఎలాంటి సమస్య ఉన్నా తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. నాలా ఆక్రమణకు గురైనట్లు రుజువు చేసే చిత్రాలు పాతవి, ప్రస్తుతానివి కూడా తీసుకువచ్చి ప్రజావాణిలో ఫిర్యాదు చేస్తే ఉపయుక్తంగా ఉంటుందని సూచించారు.

రారెత్తిస్తున్న ఔటర్!

ఓఆర్ఆర్‌పై 2024లో రెట్టింపైన ప్రమాదాలు

- అంతకుముందు ఏడాది కంటే రెండింతలు
- 'వరుస' మారుతున్న ప్రయాణాలతోనూ ముప్పు
- అతివేగం, అజాగ్రత్తలు కూడా ఓ కారణమే..



సాక్షి, సిటీబ్యూరో: భాగ్యనగరానికి మణిహారంగా తీర్చిదిద్దిన ఔటర్ రింగ్ రోడ్డు (ఓఆర్ఆర్) ప్రమాదాలకు చిరునామాగా మారింది. ఔటర్ ఎక్కాలంటే భయపడాల్సిన పరిస్థితి నెలకొంది. ఏటా ఓఆర్ఆర్‌పై రోడ్డు ప్రమాదాలు పెరుగుతూనే ఉన్నాయి. 2023 సంవత్సరం కంటే 2024లో ప్రమాదాలు వంద శాతం పెరిగి రెండింతలకు చేరాయి. అతి వేగం, అజాగ్రత్తలే ప్రమాదాలకు ప్రధాన కారణాలుగా కనిపిస్తున్నాయి.

నిత్యం 1.5 లక్షల వాహనాల రాకపోకలు

హైదరాబాద్ చుట్టూ 158 కి.మీ పొడవుతో 8 వరుసల్లో నిర్మించిన ఓఆర్ఆర్‌పై వాహనాలు 120 కి.మీ వేగంతో ప్రయాణించవచ్చు. ప్రతిరోజూ దాదాపు 1.5 లక్షల వాహనాలు దీనిపై రాకపోకలు సాగిస్తున్నాయి. అత్యాధునికంగా నిర్మించిన ఈ రోడ్డుపై అతివేగంగా, అజాగ్రత్తగా వాహనాలు నడుపుతుండటంతో ప్రమాదాలు సంభవిస్తున్నాయి.

ప్రాణాలు హరిస్తున్న అతివేగం

ఓఆర్ఆర్‌పై ప్రమాదాలకు ప్రధాన కారణం మితిమీరిన వేగం. ఇక్కడ గరిష్ఠంగా 120 కి.మీ వేగంతో వెళ్లొచ్చు. చాలా వాహనాలు ఏకంగా 140–160 కి.మీ వేగంతో వెళ్తున్నాయని పోలీసులు చెబుతున్నారు. అత్యధికంగా 200 కి.మీ వేగంతో వెళ్లిన వాహనాన్నీ గుర్తించినట్లు తెలిపారు. పరిమితికి మించిన వేగంతో వెళ్లే వాహనాలపై కనీసం రోజుకు అధిక సంఖ్యలో కేసులు నమోదు చేస్తున్నట్లు వెల్లడించారు. ఇంత వేగంతో వాహనం వెళ్తున్నప్పుడు ఏదైనా అత్యవసర పరిస్థితిలో అదుపు చేయడం కష్టసాధ్యమే.

'వరుస' మారితే ప్రమాదమే..

ఓఆర్ఆర్‌పై ఒకవైపు 4, మరోవైపు 4 వరుసలున్నాయి. ఒకవైపు మొదటి రెండు వరుసల్లో 120 కి.మీ వేగంతో ప్రయాణించే వీలుంది. మిగిలిన 2 వరుసల్లో వాహన వేగం పరిమితి 80 కి.మీ. ఈ లేన్ల గందరగోళంలో అనేక ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. 120 కి.మీ వేగంతో వెళ్లే వాహనాలు ఒక్కసారి పక్కనే ఉన్న 80 కి.మీ లైన్‌లోకి దూసుకొస్తుండటంతో అక్కడున్న వాహనాలను ఢీకొడుతున్నాయి. కొందరు వాహనదారులు అవగాహన లేకుండా ఒక్కసారిగా 80 కి.మీ లేన్ నుంచి 120 కి.మీ లైన్‌లోకి వెళ్తుండటం కూడా ప్రమాదాలకు కారణమవుతోంది. ఔటర్‌పై లారీలు 80 కి.మీ లైన్‌లోనే వెళ్లాలి. కొందరు డ్రైవర్లు 120 కి.మీ లేన్‌లోకి వెళ్లి ప్రమాదాలకు కారణమవుతున్నారు. కొన్నిసార్లు వేగంగా వెళ్లే లారీని అకస్మాత్తుగా నిలుపుతుండటంతోనూ ప్రమాదాలు సంభవిస్తున్నాయి.



కారణాలెన్నో..

- ఓఆర్ఆర్ అనేక వంపులతో నిర్మితమైంది. ఈ వంపుల దగ్గర తాము నడుపుతున్న వాహనాన్ని నియంత్రించలేని పరిస్థితుల్లో పక్కన ఉన్న రెయిలింగ్‌కు ఢీకొడుతున్నారు.
- ఏవైనా సమస్యలుంటే వాహనాలు పక్కకు నిలిపి ఉంచేందుకు ప్రత్యేక ఏర్పాట్లు ఉన్నా.. వాటిని పట్టించుకోకుండా రహదారిపైనే భారీ వాహనాలను సైతం నిలిపేస్తున్నారు. పర్యవేక్షణ లోపం కూడా తోడవ్వడంతో ఔటర్‌పై ఈ తరహా ప్రమాదాలు షరామామూలు అయ్యాయి.
- కొన్నిచోట్ల సర్వీస్ రోడ్డు నుంచి ఓఆర్ఆర్‌కి వచ్చేటప్పుడు వాహనాల సిగ్నల్ వ్యవస్థను ఉపయోగించకుండా దూసుకురావడంతో కూడా ప్రమాదాలకు కారణమవుతున్నారు. నడిపేవారి నిద్రలేమితోనూ ప్రమాదాలు జరుగుతున్నాయి.
- ఓఆర్ఆర్‌పై చెట్ల నరికివేత ఇతరత్రా పనులు చేసేటప్పుడు తగిన హెచ్చరిక వ్యవస్థలను వినియోగించడం లేదు. అదే సమయంలో రోడ్డు పక్కన సిబ్బంది వాహనాలను నిలిపి ఉంచడం కూడా ప్రమాదాలకు కారణమవుతోంది.

మరో ఉద్యమానికి సన్నద్ధం!

- కొంగరఖుర్దు రెవెన్యూలో ఐటీ పార్కు ఏర్పాటు
- 270 ఎకరాల భూ సేకరణకు నోటిఫికేషన్
- ఆందోళనలో బాధిత రైతులు
- న్యాయం చేయకుంటే పోరుబాట తప్పదని హెచ్చరిక



రావిర్యాల కొంగరఖుర్దు-ఏలో ఐటీ ఇండస్ట్రియల్ పార్కు ఏర్పాటు చేయనున్న భూములు

తుక్కుగూడ: రావిర్యాల కొంగరఖుర్దు రైతులు మరో ఉద్యమానికి సన్నద్ధం అవుతున్నారు. రాష్ట్రంలో ఇప్పటి వరకు రైతుల నుంచి అత్యధికంగా భూ సేకరణ చేపట్టిన గ్రామంగా రావిర్యాల నిలిచింది. ఇప్పటికే ఇక్కడ ఆర్‌సీఐ కోసం 2వేల ఎకరాలు, హార్డ్‌వేర్ పార్కుకు 1,200, ఫ్యాబ్‌సిటీకి 880, ఔటర్ రింగ్‌రోడ్డుతో పాటు పరిశ్రమల ఏర్పాటుకు 550 ఎకరాల భూములను సేకరించారు. మరో 800 ఎకరాలకుపైగా రావిర్యాల చెరువులో నీట మునిగింది. ప్రస్తుతం కొంగరఖుర్దు రెవెన్యూ- ఏ పరిధిలోని 289 సర్వే నంబర్‌లో అసైన్డ్ భూములు మాత్రమే మిగిలాయి.

తాజాగా నోటిఫికేషన్

ఫ్యూచర్ సిటీకి అనుబంధంగా ప్రభుత్వం ఐటీ ఇండస్ట్రియల్‌ను ఏర్పాటు చేయనుంది. ఇందుకు మున్సిపల్ పరిధిలోని రావిర్యాల కొంగరఖుర్దు రెవెన్యూ- ఏను ఎంచుకుంది. ఇందులో భాగంగా భూసేకరణ కోసం నోటిఫికేషన్ జారీ చేసింది.

పంటల సాగే జీవనాధారంగా..

కొంగరఖుర్దు- ఏ సర్వేనంబర్ 289లో మొత్తం 277 ఎకరాల అసైన్డ్ భూమి ఉంది. ఇందులో 140 మంది రైతులు వరి, ఆకుకూరలు, కూరగాయలు, పూల తోటలు సాగు చేయడంతో పాటు పాడి పరిశ్రమ, మేకలు, గొర్రెల పోషణ చేపడుతున్నారు. ప్రభుత్వం వీటిలో 270 ఎకరాలు తీసుకోనుందనే వార్తల నేపథ్యంలో తమ పరిస్థితి ఏమిటని వారు ఆందోళనకు గురవుతున్నారు.

రైతుల నుంచి అభిప్రాయ సేకరణ

ఐటీ ఇండస్ట్రియల్ పార్కు ఏర్పాటు సందర్భంగా కలెక్టర్ ఆదేశం మేరకు గతనెల 20న రెవెన్యూ, ఐజీఐసీ అధికారులు రావిర్యాలలో గ్రామసభ నిర్వహించారు. భూములు కోల్పోతున్న రైతుల అభిప్రాయాలు అడిగి తెలుసుకున్నారు. ఇప్పటికే గ్రామంలోని వందలాది ఎకరాల భూములు తీసుకున్నారని, ఉన్న కొద్ది భూమిని సైతం లాక్కుంటే తామెక్కడికి పోవాలని రైతులు ప్రశ్నించారు. మార్కెట్లో తమ భూమి విలువ ఎకరాకు రూ.10 కోట్లు ఉందని, అదే స్థాయిలో పరిహారం ఇవ్వడంతో పాటు ఎకరా భూమికి వెయ్యి గజాల చొప్పున ప్లాట్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేదంటే పోరుబాట తప్పదని హెచ్చరించారు.

ఉపాధి ఉండదు



ఇప్పటికే రావిర్యాలలో ఆర్‌సీఐ, హార్డ్‌వేర్ పార్కు, ఫ్యాబ్ సిటీ, ఔటర్ రింగ్ రోడ్లకు భూములు తీసుకున్నారు. మిగిలిన భూములు కూడా పోతే మాకు ఉపాధి ఉండదు.

– శేఖర్, రైతు, రావిర్యాల

న్యాయం చేస్తాం

కొంగరఖుర్దు- ఏలో ఐటీ, ఇండస్ట్రియల్ పార్కు ఏర్పాటుకు ప్రభుత్వం నిర్ణయించింది. 2013 భూసేకరణ చట్టం ప్రకారం నిర్వాసితులకు పరిహారం అందిస్తుంది. ఇప్పటికే రైతుల అభిప్రాయాలు సేకరించాం. వారి డిమాండ్లను ప్రభుత్వానికి నివేదించి, న్యాయం జరిగేలా చూస్తాం.

– జగదీశ్వర్‌రెడ్డి, ఆర్డీఓ, కందుకూరు

భగవద్గీత సంస్కృతికి కేంద్ర బిందువు

చిన్నజీయర్ స్వామి



శంకర్‌పల్లి: భగవద్గీత అనేది భారతీయ సంస్కృతికి కేంద్ర బిందువు అని త్రిదండి చిన్న జీయర్ స్వామి అన్నారు. మోకిలలోని శ్రీ లక్ష్మీ నర్సింహా స్వామి దేవాలయ ఆవరణలో శనివారం ప్రజ్ఞావేదిక్ తరగతులను ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ.. ప్రస్తుతం మారుతున్న పరిస్థితుల్లో మనుషులు తమ మూలాలు మరిచిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పిల్లలకు చిన్నప్పటి నుంచే భగవద్గీతలోని 700 శ్లోకాలు, 18 అధ్యాయాల గురించి చెప్పి, వివరించాలన్నారు. ఉదయం, సాయంత్రం భూమాత, తల్లిదండ్రులకు నమస్కారం చేసే అలవాటు తప్పక నేర్పించాలని సూచించారు. ప్రజ్ఞావేదిక్ తరగతుల ద్వారా భారతీయ విలువలు, మూలాలపై అవగాహన కలుగుతుందని, దీనిని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రజ్ఞా ఫౌండేషన్ నిర్వాహకురాలు రోహిణి, పీఏసీఎస్ చైర్మన్ గోపాల్, మాజీ సర్పంచ్ నర్సింలు, సుమిత్రా మోహన్‌రెడ్డి, విశ్రాంత వీఆర్‌ఓ నర్సింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చంపి భూములు తీసుకోండి



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న ఇర్విన్ రైతులు

- మాడ్గుల మండలం ఇర్విన్ రైతుల ఆవేదన
- రిజర్వాయర్ ఏర్పాటుకు భూములివ్వబోమని స్పష్టీకరణ
- కలెక్టరేట్ ఎదుట బాధితుల ఆందోళన

ఇబ్రహీంపట్నం రూరల్: తమకు విషమిచ్చి చంపిన తరువాతే తమ భూములు రిజర్వాయర్ ఏర్పాటు కోసం తీసుకోవాలని మాడ్గుల మండలం ఇర్విన్ గ్రామ రైతులు పేర్కొన్నారు. ఈ మేరకు శనివారం కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా బాధితులు మాట్లాడుతూ.. ఏళ్ల తరబడి భూములను నమ్ముకొని జీవిస్తున్నామని, వాటిని కోల్పోతే తమ పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. తమ ప్రాంతానికి చెందిన వ్యక్తి ముఖ్యమంత్రి అయితే బాధలు తీరుతాయనుకుంటే న్యాయం జరగడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వ హయాంలో రిజర్వాయర్ ప్రతిపాదన ఉండగా సర్కార్ పెద్దలను కలవడంతో విరమించుకున్నారని గుర్తు చేశారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం కక్ష పూరితంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. ఒకవేళ రిజర్వాయర్ కోసం భూములు సేకరిస్తే భూమికి భూమి ఇవ్వాలన్నారు. లేదంటే ట్రిపుల్ ఆర్‌కి, ఫోర్త్ సిటీ రోడ్డుకు భూములు కోల్పోతున్న రైతులకు పరిహారం ఇస్తున్నట్లుగా చెల్లించాలని డిమాండ్ చేశారు. ఇంట్లో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని కోరారు. గ్రామంలో 1000 ఎకరాలు ఉంటే 900 ఎకరాలకుపైగా రిజర్వాయర్ కోసం కోల్పోవాల్సి వస్తుందన్నారు. ప్రభుత్వం రిజర్వాయర్ ఏర్పాటు నిర్ణయాన్ని విరమించుకోవాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం జిల్లా రెవెన్యూ అధికారి సంగీతకు వినతిపత్రం అందజేశారు.

కొండాపూర్‌లో రెచ్చిపోయిన కబ్జాదారులు


స్వర్ణలత రెడ్డి స్థలంలోకి వచ్చిన దుండగులు


ఘటనా స్థలంలో గచ్చిబౌలి పోలీసులు

- స్వర్ణలత రెడ్డి స్థలంలో దుండగుల హల్‌చల్
- సెక్యూరిటీపై రాళ్లు, పెట్రోల్ ప్యాకెట్లు, కర్రలతో దాడికి యత్నం
- భయభ్రాంతులకు గురి చేసిన నర్సింహారెడ్డి, అనీల్‌రెడ్డిల కిరాయి ముఠా

గచ్చిబౌలి: కొండాపూర్‌లో కబ్జాదారులు రెచ్చిపోయారు. పెట్రోల్ ప్యాకెట్లు, రాళ్లు , కర్రలతో దాడికి యత్నిస్తూ భయభ్రాంతులకు గురి చేశారు. సైబరాబాద్ కమిషనరేట్‌కు కూతవేటు దూరంలో కబ్జాదారులు గలాట సృష్టించడం చర్చనీయాంశంగా మారింది. కొండాపూర్ సర్వే నెంబర్ 67/2లో రెండెకరాల 8 గుంటల స్థలం రాజ్యసభ్యులు వైవీ సుబ్బారెడ్డి సతీమణి వై.స్వర్ణలత రెడ్డి పేరిట ఉంది. ఆ స్థలం తమదే అంటూ జి.నర్సింహ్మా రెడ్డి, అనీల్ రెడ్డి, షేక్ జమీల్‌లు పలు సార్లు కబ్జా చేసేందుకు ప్రయత్నించారు. కోర్టులో కేసు పెండింగ్‌లో ఉండగానే శుక్రవారం సాయంత్రం సైట్‌లోకి 15 మంది దుండగులను పంపించారని స్వర్ణలతరెడ్డి మేనేజర్ సుబ్రహ్మణ్యం పేర్కొన్నారు. తమను స్థలం ఖాళీ చేయాలని బెదిరించారని డయల్ 100 కు కాల్ చేస్తే రాత్రి 11 గంటలకు గచ్చిబౌలి పెట్రోలింగ్ పోలీసులు వచ్చారని పేర్కొన్నారు. పోలీసులు వచ్చినా స్థలంలోనే రాత్రంతా తిష్ట వేశారని తెలిపారు. శనివారం మధ్యాహ్నం మరో 15 మంది స్థలంలోకి వచ్చి సెక్యూరిటీపై రాళ్లు, పెట్రోల్ ప్యాకెట్లు విసిరి కర్రలతో దాడికి యత్నించారని తెలిపారు. తెలంగాణ ప్రభుత్వంలోని పెద్దలకు దగ్గరి వ్యక్తులమని చెప్పుకునే నర్సింహ్మా రెడ్డి, అనిల్ రెడ్డిలు ఇంజక్షన్ ఆర్డర్ ఉన్నా దుండగులను సైట్‌లోకి పంపించారని వాపోయారు. డయల్ 100 కాల్ చేస్తే గచ్చిబౌలి ఇన్‌స్పెక్టర్ హబీబుల్లాఖాన్, ఎస్‌ఐ అనిల్ వచ్చిన తరువాత స్థలం నుంచి బయటకు వెళ్లిపోయారన్నారు. కోర్టులో కేసు పెండింగ్‌లో ఉందని ఇరు వర్గాలు వారు స్థలంలోకి వెళ్లవద్దని ఇన్‌స్పెక్టర్ హబీబుల్లాఖాన్ సూచించారు. ఇది ఇలా ఉంటే నర్సింహ్మా రెడ్డి, అనీల్ రెడ్డి, జమీల్ మనుషులు దాడులకు పాల్పడ్డారని చట్ట రీత్యా చర్య తీసుకోవాలని స్వర్ణలత రెడ్డి గచ్చిబౌలి పోలీసులకు ఫిర్యాదు చేశారు.

నంబర్ ప్లేట్‌లేని బైక్‌లు సీజ్

బొంరాస్‌పేట: వాహన ధృవపత్రాలు, నంబర్ ప్లేట్ లేకుండా తిరిగే బైక్‌లను సీజ్ చేస్తున్నామని ఎస్‌ఐ రవూఫ్ తెలిపారు. శనివారం మండల పరిధిలోని బురాన్‌పూర్‌లో స్పెషల్ డ్రైవ్ చేపట్టారు. గ్రామంలోని వై జంక్షన్ వద్ద చెక్ పోస్టు ఏర్పాటు చేసి నంబర్‌ప్లేట్ లేని 21 బైక్‌లను సీజ్ చేసి స్టేషన్‌కు తరలించారు. రోడ్డు భద్రతా నియమాలపై అవగాహన కల్పించారు.

మల్కాపూర్‌లో యువకుల మధ్య ఘర్షణ

తాండూరు రూరల్: మండల పరిధిలోని మల్కాపూర్‌లో శుక్రవారం అర్ధరాత్రి ఉద్రిక్తత చోటు చేసుకుంది. వివరాలు.. గ్రామానికి చెందిన ఓ వర్గం యువకుడికి మరో వర్గం యువకుడి మధ్య డబ్బు విషయమై మనస్పర్ధలున్నాయి. కొత్లాపూర్ శివారులో రేణుక ఎల్లమ్మ జాతరకు శుక్రవారం ఓ యువకుడు వచ్చాడు. విషయం తెలుసుకున్న మరో వర్గం వారు అక్కడి చేరుకుని గొడవపడ్డారు. రాత్రి 11గంటల సమయంలో దాడికి దిగారు. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని ఇరువర్గాల వారిని స్టేషన్‌కు తరలించారు. శనివారం ఇరువర్గాల పెద్ద మనుషులు స్టేషన్‌కు చేరుకుని రాజీ కుదుర్చుకుంటామని చెప్పారు. దీంతో వారిని తహసీల్దార్ తారాసింగ్ ఎదుట బైండోవర్ చేశారు.

నిధులు లేక పనులు సాగక!

- మధ్యలోనే ఆగిపోయిన అదనపు గదుల నిర్మాణం
- సరూర్‌నగర్ ప్రభుత్వ కాలేజీ విద్యార్థులకు తప్పని తిప్పలు
- సౌకర్యాల కల్పనలో ప్రభుత్వం, అధికారులు విఫలం


తాత్కాలికంగా ఏర్పాటు చేసిన టాయిలెట్లు


నిలిచిపోయిన అదనపు తరగతుల భవన నిర్మాణం

హుడాకాంప్లెక్స్: మరో రెండు రోజుల్లో కాలేజీ తలుపులు తెరుచుకోనున్నాయి. తరగతులు పునఃప్రారంభం కానున్నాయి. పైసా ఖర్చు లేకుండా ప్రభుత్వ జూనియర్ కాలేజీలో మంచి కోర్సుల్లో చేరి, బాగా చదువుకోవచ్చని భావించిన నిరుపేద విద్యార్థులకు ఎప్పటిలాగే ఈ ఏడాది కూడా సమస్యలు స్వాగతం పలకనున్నాయి. నిధుల లేమి, ప్రభుత్వ అలసత్వంతో కాలేజీలో చేపట్టిన అదనపు గదుల నిర్మాణ పనులు మధ్యలోనే నిలిచిపోయాయి. విద్యార్థుల నిష్పత్తి మేరకు క్లాస్ రూమ్‌లు లేకపోవడంతో ఈసారి కూడా అవస్థలు తప్పేలా లేవు.

రూ.2 కోట్లు మంజూరు

సరూర్‌నగర్ ప్రభుత్వ జూనియర్ కాలేజీలో ఆరు కోర్సులు (ఇంగ్లిష్, తెలుగు మీడియం) అందుబాటులో ఉన్నాయి. 700 మందికి పైగా విద్యార్థులు చదువుతున్నారు. వీరిలో అబ్బాయిలతో పోలిస్తే అమ్మాయిలే అధికం. రెండు అంతస్తుల పాత భవనంలో 18 గదులు మాత్రమే ఉన్నాయి. ఇందులో ప్రిన్సిపాల్, స్టాఫ్ రూములతో పాటు లైబ్రరీ, ప్రయోగశాలల కోసం ఏడు గదులను కేటాయించారు. మిగిలిన వాటిలో.. ఆరు గదుల్లో సగటున 40 మందికన్నా ఎక్కువ మంది కూర్చునే వెసులుబాటు లేదు. దీంతో రెండేళ్ల క్రితం ప్రభుత్వం 12 అదనపు గదుల నిర్మాణానికి రూ.2 కోట్లు కేటాయించింది. ఇప్పటి వరకు కేవలం రూ.1 కోటి మంజూరు చేసింది. చేపట్టిన పనులు అసంపూర్తిగా మిగిలిపోయాయి. దీంతో కొత్తగా అడ్మిషన్లు పొందిన విద్యార్థులు కూర్చునేందుకు తరగతి గదులు, కుర్చీలు లేక ఇబ్బంది పడాల్సి వస్తోంది.

కోర్‌సిటీకి ఆనుకుని ఉండటంతో..

కాలేజీ భవనం కోర్‌సిటీకి ఆనుకుని ఉండటం, ఇక్కడ చదువుకున్న విద్యార్థులు మంచి మార్కులు సాధిస్తుండటం, కాలేజీ చుట్టుపక్కల అనేక బస్తీలు విస్తరించి ఉండటం, ప్రైవేటు కాలేజీల్లో రూ.లక్షల్లో ఫీజు చెల్లించే స్తోమత లేని పేద, మధ్యతరగతి తల్లిదండ్రులు తమ పిల్లలను ఈ కాలేజీలో చేర్పించేందుకు ఆసక్తి చూపుతున్నారు. గదులు, మూత్రశాలలు, మరుగుదొడ్లు లేక ఇబ్బంది పడుతున్నారు. ఈ నేపథ్యంలో తాత్కాలికంగా ఆరు టాయిలెట్లు ఏర్పాటు చేశారు. వీటిలో సైతం సరిపడా నీరు లేకపోవడం, ఎప్పటికప్పుడు శుభ్రం చేయకపోవడంతో వీటిని వినియోగించేందుకు అమ్మాయిలు వెనుకాడుతున్నారు. తరగతి గదులకు కిటికీలు, డోర్లు కూడా దెబ్బతిన్నాయి. భారీ వర్షాలకు నీరు గదుల్లోకి వచ్చి చేరుతోంది. భవనం పైభాగంలో రక్షణ కోసం గ్రిల్స్ ఏర్పాటు చేయకపోవడం కూడా ఆందోళన కలిగిస్తోంది.

సదుపాయాలు కల్పించాలి



ప్రభుత్వ కాలేజీలను పాలకులు నిర్లక్ష్యం చేస్తున్నారు. విద్యార్థులు, అధ్యాపకులు ఇబ్బంది పడుతున్నారు. అనేక ఆందోళనల తర్వాత తాత్కాలిక టాయిలెట్లు ఏర్పాటు చేశారు. వీటి నిర్వహణను సైతం గాలికి వదిలేశారు. ప్రభుత్వం స్పందించి కాలేజీలో అన్ని వసతులు కల్పించాలి.

– క్రాంతికుమార్, ఏఐఎస్‌ఎఫ్ నాయకుడు

యువతి అదృశ్యం


భవాని (ఫైల్)

పహాడీషరీఫ్: యువతి అదృశ్యమైన సంఘటన పహాడీషరీఫ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. శనివారం పోలీసులు తెలిపిన ప్రకారం.. జల్‌పల్లి సబితా ఇంద్రారెడ్డి కాలనీకి చెందిన రవి కుమార్తె బామండ్ల భవాని(24) ఇంటి వద్దే ఉంటుంది. మే 28వ తేదీన శంషాబాద్‌లోని గౌతమి కళాశాలలో సర్టిఫికెట్లు తీసుకొస్తానంటూ ఇంట్లో చెప్పి వెళ్లి తిరిగి రాలేదు. ఫోన్ స్విచ్ఛాఫ్ రావడంతో ఆందోళనకు గురైన కుటుంబ సభ్యులు ఆమె ఆచూకీ కోసం ఎక్కడ వెతికినా ప్రయోజనం లేకుండా పోయింది. స్థానికంగా ఉండే మహేష్ అనే యువకుడిపై అనుమానం ఉందంటూ ఆమె తల్లి బాలమణి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. ఆచూకీ తెలిసిన వారు పోలీస్‌స్టేషన్‌లో గాని 87126 62367 నంబర్‌లో సమాచారం ఇవ్వాలని పోలీసులు కోరారు.

39 మంది పోలీసుల పదవీ విరమణ

లక్డీకాపూల్ : హైదరాబాద్ పోలీసు కమిషనరేట్ పరిధిలో శనివారం 39 మంది పోలీసులు పదవీ విరమణ చేశారు. ఆయా అధికారులను కమిషనర్ సీవీ ఆనంద్ సత్కరించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ.. రిటైర్మెంట్ రోజునే అన్ని రకాల బెనిఫిట్స్ అందేలా ప్రయత్నిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జాయింట్ కమిషనర్ (అడ్మిన్) పరిమళ హానా నూతన్, డీసీపీ ఎస్పీ చైతన్య కుమార్, చీఫ్ అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

నిమ్స్‌లో..

నిమ్స్ లో నలుగురు ఉద్యోగులు పదవీ విరమణ చేశారు. నిమ్స్ లెర్నింగ్ సెంటర్ లో శనివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో డైరెక్టర్ ప్రో. నగరి బీరప్ప వారిని ఘనంగా సత్కరించి వీడ్కోలు పలికారు.

ఇనుపచువ్వలు గుచ్చుకొని కార్మికుడి మృతి

మూసాపేట: సెల్లార్‌లో డ్రిల్లింగ్ వర్క్ చేస్తుండగా మట్టికుప్పలు కూలి మీదపడంతో ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన కూకట్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన మేరకు.. నల్గొండ జిల్లాకు చెందిన బొంత నరేష్ (35) నార్సింగ్ సమీపంలోని మంచిరేవుల వద్ద నివాసం ఉంటూ కూలి పని చేసుకుంటూ జీవిస్తున్నారు. కూకట్‌పల్లి వై జంక్షన్ వద్ద ఓ కన్‌స్ట్రక్షన్ కంపెనీలో పనిచేస్తున్నాడు. సెల్లార్ చుట్టూ మట్టి కూలకుండా డ్రిల్లింగ్ వేసి ఇనుపరాడ్లు బిగించే పనులు చేస్తున్నాడు. పక్క భవనానికి, తవ్వుతున్న సెల్లార్‌కు మధ్య దూరం లేకపోవడంతో మట్టి నరేష్‌పై పడింది. అప్పటికే డ్రిల్లింగ్ చేసిన ఇనుపచువ్వలు కడుపులో గుచ్చుకోవటంతో మృతి చెందాడు. తోటి కార్మికులు అక్కడి సిబ్బంది అమోర్ ఆసుపత్రికి తరలించగా అప్పటికే చనిపోయినట్లు వైద్యులు తెలిపారు. అయితే ఇప్పటి వరకు తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు. దీంతో పోలీస్‌స్టేషన్ వద్దకు చేరుకున్న నరేష్ బంధువులు, తోటి కార్మికులు నరేష్ కుటుంబ సభ్యులకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు.

డీసీఎం డ్రైవర్‌కు రిమాండ్

నవాబుపేట: మద్యం సేవించి వాహనం నడిపి రైతు మృతికి కారణమైన డీసీఎం డ్రైవర్‌ను రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌ఐ అరుణ్‌కుమార్ తెలిపారు. మండల పరిధిలోని వట్టిమీనపల్లికి చెందిన గొల్ల కిష్టయ్య ఆవులను మేతకు తీసుకెళ్తుండగా డీసీఎం డ్రైవర్ సత్యార్ సందీప్ మద్యం మత్తులో ఆయన్ను ఢీకొట్టాడు. దీంతో రైతు అక్కడికక్కడే మృత్యువాత పడిన విషయం పాఠకులకు విదితమే. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ.. మద్యం సేవించివాహనాలను నడిపిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

నిరుపేదల సంక్షేమమే ధ్యేయం

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

- పలు గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి శంకుస్థాపన


మజీద్‌మామిడిపల్లిలో ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే

నందిగామ: నిరుపేదల సంక్షేమమే ధ్యేయంగా నిరంతరం కృషి చేస్తున్నానని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. మండల పరిధిలోని ఈదులపల్లితో పాటు శ్రీనివాసులుగూడ, మజీద్‌మామిడిపల్లి, మొత్కులగూడ, మొదళ్లగూడ, మంచన్‌పహాడ్ తదితర గ్రామాల్లో శనివారం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాసులుగూడలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నిరుపేదల సంక్షేమమే ధ్యేయంగా నిరంతరం పనిచేస్తున్నట్లు స్పష్టం చేశారు. ఉమ్మడి మామిడిపల్లిలో భూ భకాసూరిడిని ఆట కట్టించామని, ప్రస్తుత ప్రభుత్వ హయాంలో ఆయా గ్రామాల ప్రజలు స్వేచ్ఛగా బతుకుతున్నారన్నారు. తాను కార్యకర్తలను నమ్ముకొని పనిచేస్తున్నానని, భూ బకాసురిడిలా మంది భూములు అమ్ముకోలేదని విమర్శించారు. బీఆర్‌ఎస్ హయాంలో గ్రామాల అభివృద్ధి శూన్యమన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ప్రతీ ఒక నిరుపేదకు పార్టీలకతీతంగా ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామన్నారు. మొత్కులగూడలో 14, ఈదులపల్లిలో 16, శ్రీనివాసులుగూడలో 16, మొదళ్లగూడలో 24 ఇందిరమ్మ ఇళ్లు మంజూరయ్యాయని వెల్లడించారు. అనంతరం ఆయా గ్రామాల్లో ఇళ్ల నిర్మాణాలకు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ శివశంకర్‌గౌడ్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు జంగ నర్సింహా యాదవ్, మాజీ సర్పంచ్‌లు కావలి కృష్ణ, స్వామి, నాయకులు సతీష్, నవీన్‌గౌడ్, చీకుర్తి సుదర్శన్, మధుగౌడ్, పసుల బుచ్చయ్య, మాజీ ఎంపీటీసీ దేపల్లి కుమార్‌గౌడ్, శేఖర్‌రెడ్డి, ప్రభాకర్, రాజుగౌడ్, మంకాల శ్రీశైలం, రాజలింగం, సుక్యా నాయక్, చంద్రశేఖర్‌గౌడ్, నవాజ్‌రెడ్డి, అన్వర్, మల్లేశ్, సత్యనారాయణగౌడ్, సీతారాం, సత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

హర్ష టయోటా ఫెస్టివల్ కౌంటర్ ప్రారంభం

శంకర్‌పల్లి: పట్టణంలో హర్ష టయోటా ఫెస్టివల్ కౌంటర్‌ను శంకర్‌పల్లి మున్సిపల్ కమిషనర్ యోగేశ్, ఎంపీడీఓ వెంకయ్యతో కలిసి ఆ సంస్థ సేల్స్ అండ్ మార్కెటింగ్ వైస్ ప్రెసిడెంట్ ప్రశాంత్ పాములపర్తి, సేల్స్ జనరల్ మేనేజర్ జైపాల్‌రెడ్డి శనివారం ఘనంగా ప్రారంభించారు. జ్యోతి ప్రజ్వలన చేసిన అతిథులు.. అనంతరం కొత్త కార్లు, వాటి విశేషాలను అడిగి తెలుసుకున్నారు. వైస్ ప్రెసిడెంట్, జీఎం మాట్లాడుతూ.. హర్ష టయోటా ద్వారా వినియోగదారుల అభిరుచులకు తగ్గట్లుగా మెరుగైన సేవలు అందిస్తున్నామని తెలిపారు.


జ్యోతి ప్రజ్వలన చేస్తున్న యోగేశ్, చిత్రంలో ఎంపీడీఓ, హర్ష టయోటా సంస్థ ప్రతినిధులు

చీర..కోటు..నైటీ

- డ్రెస్సులు మార్చుతూ చోరీలు చేస్తున్న మహిళ
- దొంగతనానికి వెళ్లేప్పుడు చీర
- చేసిన తరువాత జీన్స్ ప్యాంటు.. కోటు
- ఇంటికి చేరుకునే సమయంలో నైటీ
- ఎట్టకేలకు పట్టుబడ్డ నిందితురాలు


దొంగతనాల తీరును వివరిస్తున్న అదనపు డీసీపీ నర్సయ్య, ఏసీపీ శశాంక్‌రెడ్డి

సికింద్రాబాద్: ఒక్క దొంగతనం చేసే సమయంలో మూడు డ్రెస్సులు మార్చుతూ తప్పించుకు తిరుగుతున్న నిందితురాలిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈస్ట్‌జోన్ అదనపు డీసీపీ జే.నర్సయ్య, చిలకలగూడ ఏసీపీ కే.శశాంక్‌రెడ్డి, ఇన్‌స్పెక్టర్ మధుసూదన్‌రెడ్డి తెలిపిన మేరకు.. పార్శిగుట్టకు చెందిన దుర్గ ఇంట్లో ఈనెల 23న 6.7 తులాల బంగారు ఆభరణాలు, కిలో వెండి, రూ.38 వేలు మాయమయ్యాయని బాధితురాలు వారాసిగూడ పోలీసులకు ఫిర్యాదు చేసింది.

500 సీసీ కెమెరాల పరిశీలనతో....

వారాసిగూడ పోలీసులు దుర్గ ఇంటి సమీపంలోని సీసీ కెమెరా ఫుటేజీల ఆధారంగా దర్యాప్తు ప్రారంభించారు. పార్శిగుట్ట నుంచి మచ్చబొల్లారం వరకు ఉన్న సుమారు 500 కెమెరాలను పరిశీలించారు. మొత్తం ఫుటేజీల్లో ఒక మహిళ ప్రయాణం కనిపించింది. అయితే సీసీ కెమెరాలు మారినకొద్దీ ఆమె ధరించిన దుస్తులు మారుతుండడంతో పోలీసులకు అనుమానం వచ్చింది. మచ్చొల్లారం ప్రాంతంలో వరుస సీసీ కెమెరాలు పరిశీలించే సరికి ఒకే మహిళ మూడు రకాల దుస్తుల్లో కనిపించడంతో ఆమెను పట్టుకునేందుకు ప్రయత్నాలు ప్రారంభించారు. దొంగతనానికి పాల్పడింది మచ్చబొల్లారం ప్రాంతానికి చెందిన గడ్డమీది విజయ (45)గా గుర్తించారు.


చోరీ తర్వాత జీన్స్ ధరిస్తున్న నిందితురాలు

విచారణలో మరో రెండు నేరాలు..

సీసీ ఫుటేజీలోని మహిళ పోలికల ఆధారంగా విజయను పట్టుకున్న పోలీసులు విచారింగా ఇదే తరహాలో దుస్తులు మార్చుతూ లోగడ మరో రెండు నేరాలకు పాల్పడినట్టు అంగీకరించింది. రాచకొండ కమిషనరేట్ పరిధిలోని నేరేడ్‌మెట్ పీఎస్, సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలోని అల్వాల్ పీఎస్ పరిధిలో తాళం వేసి ఉన్న ఇండ్లలో దొంగతనాలకు పాల్పడినట్టు పేర్కొంది. సీసీ కెమెరాల్లో తనను పోలీసులు గుర్తించకుండా ఉండేందుకు తాను ఒక్కో దొంగతనం చేయడం కోసం చీర, జీన్స్, నైటీ ఇలా మూడు రకాల దుస్తులు ధరించినట్టు పేర్కొంది. నిందితురాలి నుంచి దొంగతనానికి గురైన మొత్తం బంగారు ఆభరణాలు, వెండి, నగదును స్వాధీనం చేసుకున్న పోలీసులు నిందితురాలు విజయను రిమాండ్‌కు తరలించారు.